# సచివాలయాలకు చంద్రగ్రహణం

- నిర్వీర్యం దిశగా గ్రామ సచివాలయ వ్యవస్థ
- గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా 536 రకాల సేవలు, ఇంటివద్దకే పథకాలు
- కూటమి సర్కారు వచ్చిన తర్వాత 75 శాతం సేవల్లో కోత
- 2019కు ముందులాగే మళ్లీ మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు



కె. కొత్తవలస గ్రామసచివాలయం

**దత్తిరాజేరు:** గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సేవల కోసం గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యయప్రయాసల కోర్చి మండల, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేకుండా వారికి అన్ని రకాల సేవలు గ్రామాల్లోనే అందించేందుకు ప్రతీ రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 1.50 లక్షలకుపైగా యువతకు ఉద్యోగాలు కల్పించి, వారిని సచివాలయాల్లో నియమించారు. ఒక్కో సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించిన 10 మంది సిబ్బందిని అందుబాటులో ఉంచారు. వీరి ద్వారా సచివాలయాల్లో ప్రజలకు జనన, మరణ, ఆదాయ, నివాస, కులధ్రువీకరణ పత్రాలతో పాటు 536 రకాల ఇతర ప్రభుత్వ సేవలు అందేవి. అలాగే అర్హులకు పథకాలను ఇంటివద్దకే అందేవి. రోజూ సచివాల యాల్లో 'స్పందన' పేరిట సిబ్బంది గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలను పరిష్కరించే వారు. రేషన్ కార్డులు కూడా సచివాలయంలోనే మంజూరు చేసే వారు. రేషన్ కార్డుకు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే అర్హత ఉంటే వారంలోగా మంజూర య్యేది. కొందరికి 48 గంటలలోపలే మంజూర య్యేవి. కానీ ఇదంతా గతం. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2024 ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ప్రభుత్వ సేవలు, పథకాల కోసం ప్రజలు ఊరి దాటి వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థకు చంద్రగహణం పట్టింది. క్రమంగా సచివాలయ వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా సేవలందించే వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం ఉనికిలో లేకుండా చేసింది. ప్రస్తుతం సచివాలయాల్లో పూర్తిస్థాయి లో సేవలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. 2019కు ముందు మాదిరిగానే మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలు, నెట్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

| గజపతినగరం నియోజకవర్గంలో గ్రామ సచివాలయాల వివరాలు | |
|---|---|
| మండలం | సచివాలయాలు |
| గజపతినగరం | 19 |
| దత్తిరాజేరు | 17 |
| బొండపల్లి | 17 |
| గంట్యాడ | 22 |

### సేవలు యథాతథంగా కొనసాగించాలి



సచివాలయాల్లో సేవలను గత ప్రభుత్వంలో మాదిరిగా యథాతథంగా కొనసాగించాలి. గతంలో అన్ని సేవలూ ఊరిలోనే అందేవి. ప్రస్తుతం సచివాల యాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. సర్వేల పేరుతో బయట ఉంటున్నారు. ప్రభుత్వ సేవల కోసం మండల కేంద్రాల్లోని కార్యాల యాలు, మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇది ప్రజలకు వ్యయప్రయాసలతో కూడిన పని.

– ఇమంది శంకర్, వంగర గ్రామం, దత్తిరాజేరు మండలం

### మంచి వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు



కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయాల్లో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. గతంలో గ్రామాల్లోనే అన్ని సేవలు అందడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచి న వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం లేకుండా చేసింది. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేలా కనిపిస్తోంది. గ్రామ సచివాలయం మంచి వ్యవస్థ, దీన్ని నిర్వీర్యం చేయొద్దు.

– మజ్జి అప్పలనాయుడు, ఎం.లింగాలవలస, దత్తిరాజేరు మండలం

#### 75 సచివాలయాలు.. 600కు పైగా సిబ్బంది

గజపతినగరం నియోజకవర్గంలో గత ప్రభుత్వం 75 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి వాటిలో ఆరువందలకు పైగా సిబ్బందిని, అలాగే ప్రతీ 40 కుటుంబాలకు ఒక గ్రామ వలంటీర్‌ను నియమించింది. సచివాలయాల ద్వారా లక్షల మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు, పథకాలు అందేవి. నియోజకవర్గంలో 2021లో సచివాలయాల ద్వారా సుమారు నాలుగు లక్షల మందికి, 2022లో 4.51 లక్షల మందికి 2023లో 4.08 లక్షల మందికి 2024లో 3.02 లక్షల మందికి వివిధ సేవలు అందాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈపది నెలల కాలంలో 30 వేల మందికి కూడా సేవలు అందలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సచివాలయాల ద్వారా అందే సేవల్లో దాదాపు 75 శాతం వరకు ప్రస్తుతం నిలిచిపోయాయని సమాచారం.

## క్లుప్తంగా

### 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి


గజపతినగరంలో ర్యాలీ చేస్తున్న రెల్లి కులస్తులు

**గజపతినగరం:** ఎస్సీ వర్గీకరణలో రెల్లి, వాటి అనుబంధ ఉపకులాలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని రెల్లి కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సోము మురళీ మోహన్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లి, వాటి అనుబంధ ఉపకులా లకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో గజపతినగరం నియోజకవర్గ రెల్లి, వాటి అనుంబంధ ఉపకులాల ఐక్య సమితి ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ చేశారు. రెల్లి కులస్తుల సమస్యలను పట్టించుకుని తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరా రు. నియోజకవర్గ రెల్లి కుల సంఘం అధ్యక్షుడు గండ్రేటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధి పనులు ప్రారంభం


ఉపాధి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీదేవి

**గుర్ల:** చింతపల్లిపేట గ్రామంలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ జమ్ము శ్రీదేవి, స్థానిక నాయకుడు జమ్ము అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించ డంతో పాటు, ప్రభుత్వం నిర్ధేశించిన గరిష్ఠ వేతనం వచ్చేలే పనులు చేయించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు.

### కుళాయిల పరిశీలన


వల్లంపూడిలో ఇంటింటి కుళాయిలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, తదితరులు

**వేపాడ:** మండలంలోని వల్లంపూడిలో పంచాయతీ నిధులు రూ. ఐదు లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ బుధవారం పరిశీలించారు. రామాలయం వీధి, పెద్దదొడ్డి, ఏడువాక వీధి, నెయ్యిలవీధి, తురకదొడ్డిలలో వేసిన కుళాయిలను పరిశీలించి, ప్రజలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు, పంచాయితీ కార్యదర్శి పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, ఈఓపీఆర్‌డీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

**చీపురుపల్లి రూరల్ (గరివిడి):** తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గరివిడి మండలంలోపి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎంవీ సుబ్రహ్మణ్యంను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు అర్హత ఉన్న వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు.

### ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ, తదితరులు

**గుర్ల:** ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద మాల మహానాడు క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ వల్ల ఎస్సీలలో విభేదాలు రావడంతో పాటు విద్య , ఉపాధి , ఉద్యోగావకాశాలు తగ్గుతాయన్నారు. అనంతరం ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ నారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నూకరాజు, రాజకుమారి, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ పాడి రైతులకు శిక్షణ

**చీపురుపల్లిరూరల్(గరివిడి):** గరివిడి శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాలలో జాతీయ మాంస పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పశుపోషణపై ఎస్సీ పాడి రైతులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. సంకరజాతి ఆవుల్లో అధిక పాల ఉత్పత్తి సాధించడానికి పాటించాల్సిన మెళకువలను శిక్షకులు వివరించారు. అనంతరం కళాశాలలోని ఫోడర్ మ్యూజియంలో పండిస్తున్న 30 రకాల పశుగ్రాసాలను రైతులకు చూపించి, వాటి ప్రయోజనాలు, సాగు చేసే విధానంపై అవగాహన కల్పించారు.కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, బొండపల్లి పశువైద్యాధికారి బి.శ్రీనివాస్, పశుపోషణ విభాగపు సహాయ ఆచార్యులు డాక్టర్ సుదారాణి, ప్రొఫెసర్లు డాక్టర్ రవికుమార్, డాక్టర్ గౌతం వర్మ, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

### ఆర్థికసాయం..



గంట్యాడ మండలంలోని బుడతానపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కుష్ఠు రోగులకు ఆర్థిక సాయం చేశారు. విద్యార్థులు 9,795 రూపాయలను సేకరించి లెప్రా సొసైటీ ప్రతినిధి రమణకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

– గంట్యాడ

## నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు


లక్కవరపుకోట: చందులూరులో రైతులకు నవధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు


వేపాడ: కొండగంగుబూడిలో నవధాన్యాల విత్తన కిట్ల తయారీని పరిశీలిస్తున్న డీపీఎం ఆనందరావు

**లక్కవరపుకోట:** నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఏడీఏ ఎల్.విజయ అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల సాగుపై చందులూరు రైతుసేవా కేంద్రంలో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, జీవ వైవిధ్యం పెరుగుతుందని, ప్రధాన పంటలకు అన్ని పోషకాలు అందుతాయని, ఎరువుల వినియోగం తగ్గుతుందని చెప్పారు. అంతర పంటలుగా వీటిని సాగుచేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. తొలకరి నువ్వుల పంటల సాగు చేయాలనుకునే రైతులు నువ్వులతో పాటు నవధాన్యాల విత్తనాలను కలిపి చల్లాలని సూచించారు. పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) పద్ధతి ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగుకు అవసరమైన ఏడు రకాల విత్తనాలతో తయారు చేసిన కిట్లను రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉంచామని, ఒక కిట్‌ను రైతులకు రూ.100కు అందిస్తున్నామని తెలిపారు. చందులూరు యూనిట్‌లో 1,100 ఎకరాలు, లింగంపేట యూనిట్‌లో 820 ఎకరాల్లో నవధాన్యాల సాగుకు అవసరమైన కిట్లు అందజేయనున్నామని తెలిపారు. అలాగే ఖరీఫ్ వరి సాగుకు ముందు 18 రకాల నవధాన్యాల విత్తనాలను పొలాల్లో చల్లుకోవాలని, 12 కిలోల చొప్పున ఒక కిట్‌గా తయారు చేసి రూ.800లకు అందించనున్నట్లు వివరించారు. ఏఓ స్వాతికుమారి, వీఏఏలు సురేష్,మోహన్,తేజ ,అప్పారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరప్రసాద్,రమేష్ పాల్గొన్నారు.

**నవధాన్యాలతో భూమి సారవంతం**

**వేపాడ:** నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం)ఆనందరావు అన్నారు. కొండగంగుబూడి, పాటూరు యూనిట్‌ల లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారుచేసిన నవధాన్యాల విత్తనాల కిట్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగుకు ముందు నవధా న్యాలను సాగు చేసి చేనును కలియ దున్నాలని చెప్పారు. ఎకరానికి 12 కిలోల నవధా న్యాలు చల్లాలని సూచించా రు. సుస్థిర వ్యవసాయ కేంద్రం కో-ఆర్డినేట్ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరప్రసాద్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### రైతుల సమక్షంలోనే సర్వే చేపట్టాలి

**బొండపల్లి:** రైతుల సమక్షంలోనే భూరీసర్వే చేపట్టాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సర్వే సిబ్బందికి సూచించారు. మండలం లోని బి.రాజేరుతో పాటు పలు గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర భూరీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. రైతులకు ముందస్తుగా సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే చేయాలని, రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. తగాదాలకు తావివ్వకుండా, తప్పులు జరగకుండా పక్కాగా సర్వే చేపట్టాలని ఆదేశించారు.

### జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పని

**గజపతినగరం రూరల్:** గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఏపీఓ కృష్ణవేణి తెలిపారు.మండలంలోని పురిటిపెంట గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను బుధవారం ఆమె పరిశీలించారు. మస్టర్ల సీట్లను పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. ఒకరిపేరుపై వేరొకరు పనులకు హాజరు కాకూడదని చెప్పారు.

### వెయ్యిరోజుల సంరక్షణపై అవగాహన


ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు

**శృంగవరపుకోట:** పిల్లల వెయ్యి రోజుల సంరక్షణపై గర్భిణులు, బాలింతలకు వెంకటరమణపేట గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం అవగాహన కల్పించారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న బాలింతలు, కిశోర బాలికలతో కలిసి అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ చేశారు. బాలల వెయ్యి రోజుల సంరక్షణ కోసం ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రణాళిక ప్రతులను తల్లులకు పంపిణీ చేశారు.

### జయంతోత్సవాలను జయప్రదం చేయండి

**శృంగవరపుకోట:** మహాత్మా జ్యోతిబాపూలే, బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని బహుజన నేత ఏ.ఉదయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్.కె.ఫంక్షన్ హాల్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఈనెల 11న శివరామరాజుపేటలో నిర్వహించ తలపెట్టిన పూలే,అంబేడ్కర్ జయంతోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను బహుజన సంఘ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యే కడుబండ శ్రీనివాసరావుతో పాటు పలువురు బహుజన ఉద్యమనేతలు ఉత్సవాల్లో పాల్గొంటారని చెప్పారు. హరిజన,గిరిజన, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, సాహితీవేత్తలు, సామాజిక వేత్తలు, విద్యావేత్తలు, ప్రజా ఉద్యమ నేతలు, యువజనులు వేలాదిగా తరలిరావాలని కోరారు.

## బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

**గుర్ల:** బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పద్మావతి, రాధిక, శకుంతల అన్నారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కెల్ల గ్రామంలో బాలిం తలు, గర్భిణులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సూపర్ వైజర్లు మాట్లాడుతూ బిడ్డకు ఆరునెలల వరకు తల్లిపాలు అందించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఆరు నెలల లోపు పిల్లలకు ఆవుపాలు పట్టడం వల్ల వారిలో చురుకుదనం తగ్గుతుందన్నారు. ఏడు నెలల నుంచి పిల్లలకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### గర్భిణులకు వైద్యపరీక్షలు


బొండపల్లి: గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సమీర, సిబ్బంది

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బొండపల్లి, మెరకముడిదాం పీహెచ్‌సీల్లో గర్భిణులకు వైద్యాధికారులు జి.సమీర, కె.అజిత్‌బాబు బుధవారం వైద్యపరీక్షలు చేశారు. ఉచి తంగా మందులు అందజేసి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. మెరకముడిదాంలో గర్భిణులు, వారి సహాయకులకు భోజనసదుపాయం కల్పించారు. – బొండపల్లి/మెరకముడిదాం


మెరకముడిదాం: గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు చెబుతున్న డాక్టర్ అజిత్‌బాబు

### గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలి

**శృంగవరపుకోట:** గ్రామసభలను మొక్కుబడిగా కాకుండా ప్రజలకు ప్రయోజనం కలిగించేలా సక్రమంగా నిర్వహించాలని ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు డి.సూర్యారావు అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా గ్రామసభలు నిర్వహించాలని 2013లో చట్టం అమల్లోకి వచ్చిందని, పుష్కరకాలం గడిచినా గ్రామసభల తీరు మారలేదన్నారు. దేశానికి పార్లమెంట్, రాష్ట్రానికిఅసెంబ్లీ, గ్రామానికి గ్రామసభలు చాలా కీలకం అంటూ ఉపన్యసించే ప్రజాప్రతినిధులు గ్రామసభలను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామసభల ఆమోదం లేనిదే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సరి కాదని నాడు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించిన స్ఫూర్తి నేడు పాలకుల్లో, అధికారుల్లో కొరవడిందన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అక్కడి ప్రజలే సూచించేలా ఎక్కడా గ్రామసభలు జరిగిన దాఖలాలు లేవన్నారు. ఈనెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రారంభించాలి స్న గ్రామసభలు మూడు రోజుల మొక్కుబడి షెడ్యూల్‌తో సరిపెడుతున్నారన్నారు. ఇకనైనా గ్రామసభలు సజావుగా నిర్వహించి ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు చేపట్టి, ఎంత సొమ్ము ఖర్చు చేశారో, గ్రామానికి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని కోరారు. అక్షరాస్యత వేదిక సభ్యులు ఎం.ఎస్.ఎన్.మూర్తి, ఎల్.సాంబమూర్తి, లోకేష్ పాల్గొన్నారు. హాజరయ్యాయరు.

### నిత్యం వృథా...



మండుతున్న ఎండల వేళ తాగునీరు వృథాగా ఏరులై పారుతున్నప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఎస్.కోట మండలంలోని పెదఖండేపల్లిలో రక్షిత మంచినీటి పథకం పైపులైన్ నిత్యం తాగునీరు లీకవుతున్నా స్థానిక పంచాయతీ, సచివాలయ సిబ్బంది మరమ్మతులు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పైపులైన్ నుంచి లీకైన నీరంతా ఓవర్‌హెడ్ ట్యాంక్ కింద నిల్వ ఉండిపోతుండడంతో దోమల బెడద ఎక్కువయ్యింది. సమస్యపై పత్రికల్లో వార్త లు రావడంతో సచివాలయ సిబ్బంది వాటర్ ట్యాంక్ కింద చిప్స్ పోసి నీరు నిల్వలేకుండా చేశారు. చిప్స్ పోయడం వల్ల నాచు పట్టదని, దోమలు చేర వని చెబుతున్నారే కానీ వాటర్ లీకేజిని మాత్రం అలానే వదిలేశారు. ఉద్యోగుల పుణ్యమాని నిత్యం కొన్ని వేల లీటర్ల తాగునీరు వృథా అవుతోంది.వాటర్ ట్యాంక్ కింద వాల్వ్‌ల కోసం నిర్మించిన సంప్‌లు పైపులైన్ నుంచి లీకైన నీటితో నిండిపోయి ఉన్నాయి. పిల్లలు ఆటలాడుకునేందుకు వచ్చి ట్యాంక్ వద్ద ఉన్న సంప్‌లో పడితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని గ్రామస్తులు కోరుతున్నారు.

– శృంగవరపుకోట

### సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట



ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొత్తవలస మండల ఫీల్డ్ అసిస్టెం ట్లు ఎంపీడీఓ ఎస్.రమణయ్యకు సీఐటీ యూ నాయకులతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు మద్దిల రమణ,గాడి అప్పారావు మాట్లాడుతూ 2005 నుంచి సేవలం దిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు తగిన వేతనం ఇవ్వకుండా వారి శ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని మండిపడ్డారు.నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని,ఎన్ఎంఎంఎస్ యాప్, మ్యాన్‌డేస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఫీల్డ్‌అసిస్టెంట్లు మాట్లాడుతూ తమ డిమాండ్లను 15 రోజుల్లో పరిష్కరించాలని లేకుంటే సమ్మెబాట పడతామని స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు సీహెచ్. సీతారామ స్వామి, డి.శ్రీను, ఎం.నూకరాజు, కనకమహాలక్ష్మి, శేఖర్, భాస్కరరావు పాల్గొన్నారు. – కొత్తవలస

### నవధాన్యాల విత్తన కిట్ల పంపిణీ



ఎస్.కోట మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామంలో రైతులకు ఏఓ రవీంద్ర ఆధ్వర్యంలో నవధాన్యాల విత్తన కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఏఓతో పాటు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు ప్రకృతిసేద్యంపై అవగాహన కల్పించారు. వేసవి నువ్వుల పంట సాగు చేసే భూమిలోనే అంతర పంటగా నవధాన్యాలను సాగు చేయాలని సూచించారు. నువ్వు పంట వేసే ముందు నవధాన్యాలను చల్లుకోవాలని చెప్పారు.

– శృంగవరపుకోట